క్లుప్తంగా

సంస్మరణ దినం..రక్తదానం



మంగళగిరి: పట్టణంలోని ఏపీ ఎస్పీ బెటాలియన్‌లో గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి కమాండెంట్ జి.నగేష్ బాబు మెమెంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్‌లు డి.వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో పశుగణన సర్వే



ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం నుంచి 21వ అఖిల భారత పశుగణన సర్వే నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిరంగిపురం, అమీనాబాద్, రేపూడి, 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు, నుదురుపాడు, వేమవరం, మేరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడివాని గ్రామాల్లో లైవ్ స్టాక్ సెన్సెస్ ఎన్యుమరేటర్లు, ఏహెచ్ఏలు సర్వే చేస్తారని చెప్పారు. ఇంటింటికి వెళ్లి పశువుల వివరాలు, లేనివారి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అంటిస్తారన్నారు. సర్వేకు సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లను లైవ్ స్టాక్ సెన్సెస్ ఎన్యుమరేటర్లు, ఏహెచ్ఏలకు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాతూరు రోడ్డులో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కోటయ్య కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. బట్టుపల్లి మండలం, వెల్లటూరులో నివాసి మోటూరి రవికుమార్ (39) విజయవాడలోని ఒక కన్సల్టెన్సీ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య కూతురితో కలసి విజయవాడ పటమటలో నివాసముంటున్నాడు. తల్లి స్వగ్రామమైన వెల్లటూరులో నివాసముంటోంది. ప్రతి ఆదివారం తల్లిని చూసేందుకు రవికుమార్ వెల్లటూరు వెళ్తాడు. ఇదే సమయంలో ప్రాతూరు వద్ద మోటూరి రవికుమార్ ద్విచక్ర వాహనంపై నుంచి కొంద పడిపోవడంతో తలకు గాయమైంది. ఈ నెల 20 నుంచి విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

జీఆర్పీ పోలీసుల విధులపై అవగాహన

తెనాలిరూరల్: ప్రజల రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరాయంగా పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి విధులను నిర్వహిస్తారు, అలాగే వెపన్స్ ఎందుకు వినియోగిస్తారు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కొన్ని అసాంఘిక శక్తులను అణిచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వంటి అంశాలపై తెనాలి ప్రభుత్వ రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక మారిస్‌పేటలోని ఎన్‌సీఆర్ఎం హైస్కూల్ లో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులు ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌కు గురువారం వెళ్లి అక్కడ వివరాలు తెలుసుకున్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా ఎస్ఐ జి. వెంకటాద్రి విద్యార్థులకు పోలీస్ విధుల గురించి వివరించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 21 నుంచి నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా రైల్వే జీఆర్పీ పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అనేక విషయాల గురించి తెలియజేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జీఆర్పీ పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పాల్గొనండి

తెనాలిఅర్బన్: తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ తైక్వాండో అకాడమీ సహకారంతో ఈ నెల 26, 27 తేదీల్లో తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనునట్లు ఈగల్ రెస్టారెంట్ అధినేత ఈదర వెంకట పూర్ణచంద్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావులు తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లు, కరపత్రాలను గురువారం తెనాలిలో ఆవిష్కరించారు. సీనియర్స్, మినీ సబ్ జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం వెనుక లక్ష్మీనరసింహా సోమయాజీ వైశ్య వ్యాయామ మందిరంలో వీటిని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ అకాడమీ నిర్వాహకులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, కోచ్ రోహిత్‌శర్మ, టి.చంటి, టి.బాలు, తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమానికిలేని ప్రహరీ



తాగునీరు నిల్వ ఉంచే దిగుడుబావి

ఆశ్రయానికి సాయం కావాలి

- అనాథల ధామం నిర్మల్ హృదయ్
- పాతికేళ్ల నుంచి వృద్ధులు, అనాథలకు ఆశ్రయం
- దాతల సాయంతో ఆలనాపాలన
- ప్రస్తుతం వెంటాడుతున్న సమస్యలు
- తాగునీటి సమస్యతో తప్పని ఇబ్బందులు
- ప్రహరీ లేక రక్షణ కరువు
- దాతలు, ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు



అనాథాశ్రమంలోని పిల్లలు, వృద్ధులు

ఫిరంగిపురం: ఎందరో అనాథలను ఆదుకున్న నిర్మల్ హృదయ్ అనాథాశ్రమం నేడు తాగు నీరు, ప్రహరీ లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆశ్రమాన్ని ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఆకురాతి ప్రసాద్, ఆయన భార్య జ్ఞానసుందరి 1995లో స్థాపించారు. జ్ఞాన సుందరి ఆశ్రమం స్థాపించడానికి ముందు గుంటూరులోని మదర్ థెరిస్సా హోంలో ఐదేళ్ల ఆయాగా పనిచేశారు. అనంతరం తానే సొంతంగా ఆశ్రమాన్ని స్థాపించి, అనాథలకు, వృద్ధులకు సేవ చేయాలనే తలంపుతో ఓ ప్రైవేట్ భవనం అద్దెకు తీసుకొని ఇద్దరు పిల్లలతో ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి, తెలిసిన వారి వద్దకు వెళ్లి వారిచ్చిన కొద్ది పాటి నగదుతో 60మంది వరకు పిల్లలను చేరదీశారు. తల్లిదండ్రులు చనిపోయిన వారి పిల్లలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో తప్పిపోయిన పిల్లలను తీసుకొచ్చి వారి ఆలనాపాలన చూశారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో వారిని చదివించారు.

అన్నదానం

గ్రామంలో ఏమైనా శుభకార్యాలు నిర్వహించుకున్నవారు ఇక్కడ ఉన్న పిల్లలకు అన్నదానం చేస్తారు. అంతేకాక పుట్టినరోజు, సంవత్సరికాలు నిర్వహించేవారు ఆశ్రమానికి భోజనం పంపిస్తారు.

నూతన భవనం

నెదర్లాండ్‌కు చెందిన చర్చి ఫాదర్లు ఎడ్రియా గ్రామానికి వచ్చినప్పుడు వీరు నిర్వహించే ఆశ్రమాన్ని చూసి గ్రామ శివారులో రెండు ఎకరాలు కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించి ఇచ్చారు. దీంతో అనాథాశ్రమంలో ఉండి చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకొన్న 40 మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో యువతులకు దగ్గరుండి ఆశ్రమ నిర్వాహకులు వివాహాలు చేశారు.

తాగునీటికి ఇక్కట్లు

ఇక్కడి భూగర్భ జలాలు ఉప్పగా ఉండటంతో తాగు నీటికి పిల్లలు, వృద్ధులు ఇక్కట్లు పడుతున్నారు. ఓ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు వారానికి ఒక ట్యాంకు నీరు అందిస్తున్నారు. కాగా, ఆ నీరు నాలుగు రోజులకు సరిపోతోంది. మిగిలిన రోజులకు నీటిని కొనుగోలు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఆకురాతి ప్రసాద్ తెలిపారు. ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.

ప్రభుత్వం, దాతలు సాయం అందించాలి



ఎన్నో ఏళ్లుగా సమస్యలతో ఇక్కట్లు పడుతున్నాం. ప్రభుత్వం, దాతలు స్పందించి ప్రహరీ ఏర్పాటుకు, తాగు నీటి కొరత తీర్చేందుకు సహకరించాలి. – ఆకురాతి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకుడు

దీనిపై ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు.

ప్రహరీ లేక..

ఆశ్రమానికి చుట్టూ ప్రహరీ లేదు. ఊరి చివర కావడంతో ఆశ్రమానికి రక్షణ గోడ లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఆశ్రమంలోని అనాథ పిల్లలు, వృద్ధులతో పాటు మానసిక దివ్యాంగులు ఉన్నారు. దీంతో వారు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి, తమ సమస్యలు పరిష్కరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

‘చలపతి’లో కోడ్ హంట్ 2.0 విజయవంతం



బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో కోడ్ హంట్ 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఈవెంట్‌లో వివిధ కళాశాలలకు చెందిన 360 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విజేతలుగా కళాశాల సీఈసీ డిపార్ట్ మెంట్ ప్రథమ, జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల ద్వితీయ, హిందూ ఇంజినీరింగ్ కళాశాల తృతీయ బహుమతి సాధించగా ప్రథమ రూ.2,500, ద్వితీయ రూ.1,500, తృతీయ రూ.100 నగదు బహుమతి అందించినట్లు తెలిపారు. విజేతలకు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్ అభినందించారు. డీన్‌లు డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ బాల మురళీకృష్ణ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రాజకీయంగా అమలు చేయాలి

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణను ఆర్థిక రాజకీయ రంగాల్లో అమలు చేయాలని స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై ఆయా రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ చారిత్రాత్మక తీర్పు నివ్వడం అభినందనీయమన్నారు. సుప్రీం తీర్పు కేవలం విద్య, ఉద్యోగ రంగాలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఎస్సీల్లో బాగా వెనుకబడిన వారు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణను ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా అమలు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈపూరి ఆదామ్, చంద్ర, అట్రాసిటీ నిరోధక చట్టం పరిరక్షణ కమిటీ నాయకులు పులి దాసు, ఎమ్మార్పీఎస్ నాయకులు బాబురావు, సాంబయ్య, వందనం, దాస్ పాల్గొన్నారు.

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి



ప్రయాణికులతో మాట్లాడుతున్న డాక్టర్ సాంబశివుడు

తెనాలిరూరల్: మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించాలంటూ తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకున్న నాయకులు ప్రయాణీకులతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ నిరసన తెలియజేశారు. డిపోలో తెనాలి నుండి గుంటూరు వెళ్లే బస్సు ఎక్కిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, ఇతర నాయకులు పాత బస్టాండ్ వరకూ ప్రయాణించారు. అనంతరం డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు కొన్ని పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పేరుతో అన్నీ ఫ్రీ అంటూ హామీలు ఇచ్చారన్నారు. ఇందులో ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం హామీ ఉందని అది ఇంత వరకూ అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోందని చెప్పారు. కూటమి నాయకులు తక్షణమే ఈ ఉచిత ప్రయాణాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యన్నంశెట్టి శివ రామకృష్ణ ప్రసాద్, పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కర్లపూడి బుల్లెయ్య, పి.శివన్నారాయణ, పెనుగొండ శివకుమార్, వై. శంకర్‌రావు, పి. రాయప్ప, ఎస్. సుబ్బారావు, అయ్యప్ప, నామన మల్లికార్జున రావు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

ఫిరంగిపురం: మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగా దీనిపై గురువారం పంచయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ అనిల్ మాట్లాడుతూ ఫిరంగిపురంలో 307 వరకు వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాగా వీటిపై తనిఖీ చేసినట్లు తెలిపారు. చెరువు ప్రాంతంలో 160 మొక్కలకు గాను 130 మొక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అదే విధంగా పనులు నిర్వహించే ప్రాంతాల్లో నీడనిచ్చే టెంట్లు ఏర్పాటు చేయడం కాని, తాగునీరు అందించేలా చూడటం కాని లేవనే విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అత్యవసరంగా అవసరమయ్యే ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడాబాబు, పంచాయతీ కార్యదర్శి ఏకేబాబు సిబ్బంది పాల్గొన్నారు.

‘జగజ్జీవన్‌రామ్’ సినిమా పోస్టర్ విడుదల



ఫస్ట్‌లుక్ విడుదల చేసిన మంత్రి కందుల దుర్గేష్, పక్కన మిలటరీ ప్రసాద్, దిలీప్‌రాజా

తెనాలి: నిర్మాణంలో ఉన్న జగజ్జీవన్‌రామ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ను ఆంధ్ర ప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గురువారం సచివాలయంలో విడుదల చేశారు. తెనాలిలోని మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా–ఏపీ) కార్యాలయంలో సాయంత్రం ఆ సినిమా దర్శకుడు దిలీప్‌రాజా వివరాలను వెల్లడించారు. వందేళ్ల క్రితం జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా చిత్రీకరించడానికి మరో ఆరునెలల సమయం పడుతుందని చెప్పారు. 2025లో విడుదల చేస్తామని తెలిపారు. ఎన్నారై డాక్టర్ చందోలు నాగమల్లేశ్వర రావు నిర్మిస్తున్న ఈ బయోపిక్ తదుపరి షెడ్యూల్ నవంబరు 9 నుంచి తెనాలిలో ఆరంభమవుతుందని చెప్పారు.. జలియన్ వాలాబాగ్ లో భారతీయులను అతి కిరాతకంగా చంపిన జనరల్ డయ్యర్‌ను భారత వీరుడు సర్దార్ ఉద్దామ్‌సింగ్ కాల్చి చంపే సన్నివేశం, నాటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జన్సీ విధించడాన్ని విభేదిస్తూ జగజ్జీవన్‌రామ్ తీసుకున్న నిర్ణయాలు ఈ షెడ్యూల్లో కీలకంగా ఉంటాయని వివరించారు..జగజ్జీవన్ రామ్ పాత్రని పోషిస్తున్న మిలటరీ ప్రసాద్, ఇతర సినీ నటీనటులతో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా నటిస్తున్నారని అయన చెప్పారు. చందోలు దేవదాసు సమర్పణలో రూపొందుతున్న సినిమాకు కాలేబ్‌రాజు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్మాత డాక్టర్ చందోలు నాగమల్లేశ్వర రావు , కథ.. మాటలు..స్క్రీన్ ప్లే దర్శకత్వం దిలీప్ రాజా.

వివాహిత అదృశ్యంపై కేసు



తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన పెనుమూడి రాజ్యలక్ష్మి ఈ నెల 20వ తేదీన తమ బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చింది. ఈ విషయమై భర్త బసవశంకర్ ఆమెను మందలించాడు. 21వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. త్రీ టౌన్ ఏఎస్ఐ హైదర్ అలీ గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోపాలు ఉంటే తెలియజేయండి

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తిన వెంటనే తమకు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న స్థానికులను కోరారు. 7వ వార్డులో గురువారం పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడ రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

హిందూ ధర్మం విశ్వజనీయం

చెరుకుపల్లి:హిందూ ధర్మం విశ్వజనీయమని, అది ప్రపంచ శాంతిని కోరుకుంటుందని సమర సత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా సమన్వయ బాల వికాస్ ప్రముఖ్ యల్లాప్రగడ సీతాపతి పేర్కొన్నారు. చెరకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం రేపల్లె, నగరం, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాల ఎస్ఎస్ఎఫ్ గ్రామ కన్వీనర్ల ఒక్క రోజు శిక్షణ తరగతులు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సందర్భంగా సీతాపతి మాట్లాడుతూ హిందూ ధర్మం సనాతనమైనదని భగవద్గీత ప్రపంచంలోనే అత్యుత్తమైన గ్రంథం అది మానవాళికి మార్గదర్శకం అన్నారు, రామాయణం మానవ నడవడికను తెలియజేసి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయటానికి ఉపయోగ పడుతుందని తెలిపారు, అలాంటి హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత గ్రామ కన్వీనర్లదేనని పేర్కొన్నారు. ప్రతి నెలా గ్రామ కన్వీనర్లు గ్రామ సమావేశాలు, సత్సంగము, పౌర్ణమి సామూహిక హారతులు, వారం వారం భజన సంకీర్తనలు జరపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, బొలగాని విజయ లక్ష్మీ, వెంకటేశ్వర్లు, పడమట వెంకటేశ్వరరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ ధార్మిక సమితి కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారం అక్కడ..వ్యర్థాలు ఇక్కడ



కనకదుర్గ వారధి వెంబడి పడేసిన కాలం చెల్లిన ఫుడ్ ప్యాకెట్లు

తాడేపల్లిరూరల్: విజయవాడ కార్పొరేషన్ పరిధిలో పెద్ద మాల్స్ ఉన్నాయి. వాటిలో కాలం చెల్లిన తినుబండారాలు, చిప్స్ ప్యాకెట్ల డంపింగ్‌కు కేరాఫ్‌గా మంగళగిరి కార్పొరేషన్ మారింది. తాజాగా రేపల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి ప్రాతూరు సమీపంలో శుక్రవారం భారీ స్థాయిలో చిప్స్ ప్యాకెట్లు తీసుకువచ్చి పడేశారు. కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ, గుంటూరు చానల్, కనకదుర్గ వారధి, వడ్డేశ్వరం బకింగ్ హామ్ కెనాల్ తదితర ప్రాంతాల్లో కూల్ డ్రింక్స్, కేకులు, ఇతర తినుబండారాలను తీసుకువచ్చి పడవేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు విజయవాడలో ఉన్న షాపింగ్ మాల్స్‌కు నోటీసులు ఇస్తే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు చెబుతున్నారు. లేదంటే ఇలా వ్యర్థాలు పడేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తాడేపల్లి ప్రాంతంలోని స్లమ్ ఏరియాల్లో ఎంతోమంది పేదలు ఉన్నారు. ఈ కాలం చెల్లిన తినుబండారాలను అక్కడి పిల్లలు తిని, అనారోగ్య పాలవ్వక ముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోతులు, కుక్కలు మధ్యలో విద్యార్థినులు



హాస్టల్ ఆవరణలో కోతుల గుంపు



కోతులు హాస్టల్‌లో ఉండడంతో బయట నిలబడిన బాలికలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో ఉన్న స్థానిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద కోతులు, కుక్కల బెడద ఎక్కువైంది. దీంతో విద్యార్థినులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం పాఠశాల వదిలిన అనంతరం ఆవరణలో ఎక్కడ చూసినా కోతులు ఉండడంతో బాలికలు హాస్టల్‌లోకి వెళ్లేందుకు భయాందోళనకు గురయ్యారు. అలాగే రోడ్డుపై కుక్కలు తమపైకి ఎగబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో ముగ్గురు విద్యార్థునులపై కోతులు దాడులకు పాల్పడ్డాయి. వెంటనే అధికారులు చొరవ చూపించి కోతులు, కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు. హాస్టల్‌లో ఏమైనా తినుబండారాలు పెట్టుకుంటే వాటిని కోతులు లాక్కెళ్లిపోతున్నాయని, దుస్తులు ఆరవేస్తే చించేస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన సదస్సు

మేడికొండూరు: మండలంలోని నరసరావుపేట రోడ్డులోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో క్లౌడ్ కంప్యూటింగ్ పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. విద్యార్థి ఒక లక్ష్యం దిశగా ఎదగాలని సూచించారు. రీసెర్చ్ పర్సన్ డాక్టర్ పి.వంశీకృష్ణ రాజా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానంలో ప్రావీణ్యత కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో సమయం చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని అలవర్చుకొని మంచి ఫలితాలు రాబట్టడంతో పాటు నిర్దేశించుకున్న లక్ష్యం దరి చేరుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి, పలు విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఫాసిస్టు మూకలను తరిమి కొట్టండి

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్



సాయిబాబాకు నివాళులర్పిస్తున్న నేతలు

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చాపకింద నీరులా వ్యాపించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, అందుకు అధికార మిత్ర పక్షాలైన టీడీపీ జనసేన పార్టీలు సహకరిస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ అన్నారు. దేవాలయ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండకూడదని చంద్రబాబు తెచ్చిన జీవోనే ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ప్రధాని మోదీ ఆజ్ఞలను కాదనలేని వారి నిస్సహాయత, బలహీనతలకు ఇదొక నిదర్శనమన్నారు. తెలుగు నేలపై మతోన్మాద రాజకీయాలు చేసే ఫాసిస్టు మూకలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని చినరావూరు మున్సిపల్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తల సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంపీ రామ్‌దేవ్ అధ్యక్షత వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎన్నో మగ్గుతూ ఉంటే అవన్నీ వదిలేసి తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని కాషాయీకరణ చేస్తూ టీడీపీ, జనసేనలు మత రాజకీయాలకు తెర లేపాయన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ వాగ్దానాలు చేసి ఇప్పుడు నోరుమెదపట్లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ‘పీపుల్స్–6’ పేరుతో ప్రజలకు సంబంధించిన డిమాండ్లను మనమే లేవనెత్తి ప్రశ్నించాలని, ఆ దిశగా డిసెంబర్ 4న విజయవాడ లో తలపెట్టిన ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ‘పీపుల్స్ 6’ డిమాండ్లను, బిహార్ జార్ఖండ్ మహారాష్ట్రలో పార్టీ విజయాలను, పెరుగుతున్న శక్తిని సభాధ్యక్షుడు ఎంపీ రామ్‌దేవ్ ప్రస్తావించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ఉదయ్‌కిరణ్, కె.కోటేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థి యువజన సంఘం ఐసా–ఆర్‌వైఏ నాయకులు సుబ్బయ్య, బెన్‌హర్, వెంకటేష్, యూసఫ్, ఇనయతుల్లాతో సహా వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు.

విష వృక్షాలతో భయం భయం

తొలగించాలని స్థానికుల వినతి



భారీగా పెరిగిన కోనో కార్పస్ వృక్షాలు

తెనాలి: పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ వృక్షాలను తొలగించాలని డీఎస్పీ కార్యాలయం వెనుక, పంటకాల్వకు పడమర వైపున గల అపార్టుమెంటు వాసులు అధికారులను కోరుతున్నారు. అక్కడి అయ్యప్పగుడి రోడ్డులోని కోనోకార్పస్ మొక్కలు భారీగా పెరిగాయనీ, 40 అడుగుల ఎత్తులో ఉన్న ఈ వృక్షాలతో పర్యావరణానికి హానికరమని తెలిపారు. విషవృక్షాలుగా జనం పిలుచుకునే ఈ వృక్షాలతో భూజలాలు తగ్గిపోతాయి..ఆ చెట్లపై కనీసం పక్షులు గూళ్లు కూడా పెట్టుకోవు...చెట్ల పువ్వుల నుండి వెలువడే పుప్పొడి కారణంగా మనుషుల్లో శ్వాసకోశ వ్యాధులు తలెత్తుతాయనే కారణంగా అనేకచోట్ల ఈ చెట్లను తొలగించారు. స్థానికుల వినతిపై పట్టణంలో కూడా ప్రధాన రహదారిలో పాక్షికంగానే తొలగించారు మినహా మిగిలిన ఏరియాల్లోని పట్టించుకోలేదు. అయ్యప్పరోడ్డులో భారీగా పెరిగిన ఈ విషవృక్షాలను తొలగించాలని గ్రీన్ మినర్వా అపార్టుమెంటు సహా అక్కడి నివాసితులు విజ్ఞప్తి చేశారు.